

స్వర్ణలతకు జాతీయ నంది పురస్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు గ్రామానికి చెందిన డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు జాతీయ నంది పురస్కారం లభించింది. కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నంది పురస్కారాలకు ఎంపికైనట్టు ఆ సంస్థ జాతీయ ఛైర్మన్ పోలోజు కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘసేవకురాలిగా విశిష్ట సేవలు అందించి, తాను రచించిన మైండ్ పవర్ బుక్ గాను ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని ఈనెల 15న విజయవాడలో ఈ పురస్కారాన్ని అందజేయున్నట్లు పేర్కొన్నారు. కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు.

'ఫీజు' పరేషాన్..!

అగమ్యగోచరంగా ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థుల పరిస్థితి

గత ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల ఫీజు పెండింగ్

ఈ ఏడాది తొలివిడత ఫీజు సొమ్ము విడుదలపై స్పష్టత కరువు

ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిడి

రెండు జిల్లాల్లో దాదాపు 40 వేల మందికిపైగా విద్యార్థుల అవస్థలు

హాస్టల్ ఫీజుల చెల్లింపులపై ప్రభుత్వం మౌనం

అప్పులు చేయాల్సి రావడంతో తల్లిదండ్రులు మనోవేదన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం, అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి విద్యార్థులు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో యాజమాన్యాల నుంచి విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 వేల మందికి పైగా విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యలో కాలేజీలో వసతులను బట్టి రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదువేల వరకూ ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. హాస్టల్ ఫీజు కింద మరో రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ కాలేజీలు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నమ్ముకుని ఎంతోమంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్ములను ఏడాదిలో నాలుగు విడతలుగా చెల్లించేది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం ఒక్క విడత మాత్రమే విద్యార్థుల ఖాతాల్లో వేసింది. రూ.64 వేలు ఫీజు చెల్లించాల్సిన విద్యార్థికి రూ.16 వేలు మాత్రమే జమచేసింది. ఇంకా రూ.48 వేల ఫీజు అప్పటి వైసిపి ప్రభుత్వం చెల్లించలేదు. ఎన్నికల్లో టిడిపి కూటమి గెలిచింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు జమకు సంబంధించి ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు.

గత ఏడాది ఫీజు లేదు.. ఈ ఏడాది ఫీజుపై స్పష్టత కరువు

గత ఏడాదికి సంబంధించి పూర్తి ఫీజు చెల్లిస్తే తప్ప రెండో సెమిష్టర్ పరీక్షలు రాయడానికి కాలేజీ యాజమాన్యాలు ఒప్పుకోలేదు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి గతేడాది ఫీజులు చెల్లించారు. ప్రభుత్వం ఆ సొమ్ములు వేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభం కావడమే కాకుండా, మిడ్ పరీక్షలు సైతం కొనసాగుతున్నాయి. కొన్ని కాలేజీల్లో ఒకటి, రెండు రోజుల్లో మిడ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడత ఫీజు చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులపై ఒత్తిడి మొదలైంది. దీంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గతేడాది ఫీజుల కోసం చేసిన అప్పులు అలానే ఉన్నాయి. ఈ ఏడాది ఫీజుల పరిస్థితి ఏంటన్న బెంగ తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఉన్నత విద్యాశాఖా మంత్రిగా ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇక నుంచి ఫీజు సొమ్ములు కాలేజీ యాజమాన్యాల ఖాతాలో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా చెప్పిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొదటి విడత ఫీజు ఎప్పటిలోగా వేస్తారు, ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని విద్యార్థులు కోరుతున్నారు. కాలేజీ యాజమాన్యాల నుంచి ఒత్తిడి లేకుండా చేయాలని అడుగుతున్నారు. అంతేకాకుండా గతేడాది పెండింగ్ ఫీజును వెంటనే విడుదల చేయాలని వేడుకుంటున్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు గత ప్రభుత్వం వసతి దీవెన పేరుతో రెండు విడతలుగా ఏడాదికి రూ.20 వేలు ఇచ్చేది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి వసతి దీవెన సొమ్ములు వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం హాస్టల్ ఫీజుల సొమ్ముల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోడేరు వద్ద ముంపు నుంచి బయటపడిన పుష్కర రేవు

తేరుకుంటున్న లంక గ్రామాలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి తగ్గుముఖం పట్టింది. శుక్రవారం నాటికి గోదావరి కన్నుల్లోకి నీరు దిగింది. దీంతో అధికార యంత్రాంగంతోపాటు లంకగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముంపుబారిన పడిన పుచ్చల్లంక, అయోధ్య లంక, భీమలాపురం కాలనీ తేరుకుంటున్నాయి. పెదమల్లం, కోడేరు, భీమలాపురం, పుష్కర ఘాట్లు ముంపు నుంచి బయటపడ్డాయి. అయితే లంకగ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ సుగుణసంధ్య ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముంపునకు గురైన లంక రహదారుల్లో వరద నీరు తగ్గింది. అయితే రహదారులపై పెద్ద ఎత్తున బురద పేరుకుపోయింది. దీంతో లంకగ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పెదమల్లంలోని మాచేనమ్మ ఆలయం, పర్యాటక కేంద్రాలు ముంపు నుంచి బయటపడ్డాయి. లంక గ్రామాలను రైతులు పశుగ్రాసం కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. లంకభూములు నీట మునిగిపోవడంతో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. పశువులకు అంటు వ్యాధులు ప్రబలకుండా పశు వైద్యాధికారులు సిబ్బంది టీకాలు వేస్తున్నారు. లంక గ్రామాల్లో కూరగాయలు, పచ్చిమిర్చి, అరటి, తమలపాకు తదితర పంటలు వేసిన రైతులకు నష్టాలు తప్పలేదు. శనివారం సాయంత్రం నాటికి గోదావరి వరద ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉంది.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

విజయవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులతో, పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యశాఖ అధికారులతో విడివిడిగా సమావేశమయ్యారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ముందస్తు ప్రణాళిక చర్యలపై సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. భారత ప్రభుత్వం సూచనల మేరకు ప్రతి సంవత్సరమూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఇఒఆర్‌డిఎస్, డిఎల్‌పిఒలు, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. గతేడాది 2023లో 'చెత్త లేని భారతదేశం' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 2024లో 'స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత' పేరిట ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతివ్వాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఈ నెల 17న జాతీయ నులిపురుగు నిర్మూలనా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డి వార్మింగ్ టాబ్లెట్లు అందించాలన్నారు. జిల్లాలో 3,67,000 మంది విద్యార్థులకు డి వార్మింగ్ టాబ్లెట్లను అందించే లక్ష్యంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల సహకారంతో వైద్య సిబ్బంది ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలోని కర్మాగారాల్లో కట్టుదిట్టమైన ప్రమాద రహిత భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన పరిశ్రమల్లో తీసుకోవాల్సిన ప్రమాద రహిత భద్రతా చర్యలపై సంబంధిత అధికారులు, పరిశ్రమల యజమానులతో సమీక్షించి మాట్లాడారు. జిల్లాలోని 53 పరిశ్రమల్లో రెండు పరిశ్రమలు 'ఏ' కేటగిరి కింద, 51 పరిశ్రమలు 'బి' కేటగిరి కింద నమోదు చేయడం జరిగిందన్నారు. వాటిలో ఆరు కెమికల్ పరిశ్రమలు అత్యంత ప్రమాదంగా గుర్తించడం జరిగిందన్నారు. వీటిలో తణుకు జయలక్ష్మి ఫెర్టిలైజర్స్, తణుకు ది ఆంధ్ర షుగర్స్, ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలోని వాన్ బర్రి లిమిటెడ్, తణుకు మండలంలోని పైడిపర్రు ప్లట్స్ టెక్ ల్యాబ్స్ లిమిటెడ్, కాళ్ల మండలం జక్కారం గ్రామంలోని మల్లిఖార్జున్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు ఆంధ్ర షుగర్ లిమిటెడ్ లోని యాస్ప్రిన్ ప్లాంట్ ఉన్నాయన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ నిర్వహించి కార్మికులకు క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని కర్మాగారాల్లో ఇటీవల కాలంలో అనేక పెద్ద ప్రమాదాలు సంభవించాయన్నారు. దీని ఫలితంగా గణనీయమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లి పరిశ్రమలదారులు, సాధారణ ప్రజల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించిందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాన్ని ముందే పసికట్టేందుకు సెన్సార్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదకర యూనిట్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, భీమవరం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రామకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.

ఏచూరి మరణం పీడిత ప్రజలకు తీరని లోటు

సంతాప సభల్లో నివాళులర్పించిన సిపిఎం నాయకులు



తాడేపల్లిగూడెంలో నివాళులర్పిస్తున్న చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఉద్యమాల రథసారథి, సిపిఎం అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పీడిత ప్రజలకు తీరనిలోటని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం అన్నారు. భీమవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉద్యమాల రథసారథిగా గుర్తింపు తెచ్చుకున్న ఏచూరి తుది శ్వాస విడిచే వరకు పీడిత ప్రజల పార్టీ సిపిఎం రథసారథిగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు.

పాలకొల్లు : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమానికి పనిచేశారన్నారు. సిపిఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, యర్రా అజయ్ కుమార్, తిరుమల శ్రీనివాసన్, దేవా సుదాకర్, బాబూ, లక్ష్మి, సీతా మహాలక్ష్మి, తాళాబత్తుల గంగరాజు, ఏకల రాము, కొత్తలంక అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గణపవరం : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం గణపవరం శాఖ కార్యదర్శి ఎం.పెంటారావు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఎం గణపవరం శాఖ ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం గణపవరం గ్రామ నాయకులు కె.త్రినాథ్, చిన్నం చిన్న నాగేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఏచూరి సంతాప సభలో సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ పాదుషా, పులిదిండి రామారావు, నీలాపు ఆదినారాయణ, నాగిశెట్టి గంగారావు, శీలం యేసు, సిపిఐ నాయకులు సిద్ధబత్తుల పరబ్రహ్మం పాల్గొని సీతారాం ఏచూరికి ఘనంగా జోహార్లు అర్పించారు.

భీమవరం : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి ప్రజాశక్తి స్టాఫ్ నివాళులర్పించింది. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి ప్రజాశక్తి రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా మేనేజర్ పి.నారాయణ రాజు, డెస్క్ ఇన్‌ఛార్జ్ వి.శివప్రసాద్ పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఎ రుద్దరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్‌కు) నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన అమరవీరుల ఆశయ సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో భీమవరం, నరసాపురం డివిజన్ విలేకరులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సిపిఎం మండల కమిటీ జోహార్లు అర్పించింది. ఆయన ఆశయాలను సాధించేందుకు ఉద్యమాల్ని ముందుకు తీసుకువెళ్తామని తెలియజేశారు. శుక్రవారం ఉదయం పెంటపాడు మండలం ప్రజాసంఘాల కార్యాలయంలో సంతాప సభ జరిపి ఏచూరికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబురావు, సిపిఎం మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి పాల్గొని ప్రసంగించారు. బి.శ్రీను, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పాలకోడేరు : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సిపిఎం పాలకోడేరు మండలం కమిటీ ఘనంగా నివాళులర్పించింది. ప్రజా సంఘాల కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ మాట్లాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దున్న మరియమ్మ, నాగేశ్వరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : సిపిఎం అగ్రనేతగా చిరకాలం విలువైన సేవలు అందించిన సీతారాం ఏచూరి లేనిలోటు ఎవరూ పూడ్చలేరని పలువురు సిపిఎం జిల్లా, మండల నాయకులు అన్నారు. బ్రాహ్మణ చెరువు వద్ద శుక్రవారం సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఆల్ ఇండియా కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘనమైన నివాళులు అర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఆకుల హరే రామ్, సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, పార్టీ నాయకులు చింతపల్లి అప్పారావు, గంటి ఆంజనేయులు, మల్లుల శ్రీనివాస్, పలువురు జట్టు కార్మికులు పాల్గొన్నారు.


ఆచంట : మార్క్సిస్టు మేధావి సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి శుక్రవారం ఆచంట వేమవరం సిపిఎం కార్యాలయంలో శాఖా కార్యదర్శులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, బళ్లారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యమాలతో అంచలంచెలుగా సిపిఎం జాతీయ కార్యదర్శిగా సీతారాం ఏచూరి ఎదిగారని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పోడూరు పార్టీ కార్యాలయం వద్ద ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల నాయకులు మూడేమోజేష్, బొంతు శ్రీను, కాకర వెంకటేశ్వర్లు, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

తణుకు : ప్రజలు పక్షాన విద్యార్థి దశ నుంచి తుది శ్వాస విడిచే వరకు పోరాటం సాగించిన మార్క్సిస్టు యోధుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆయన మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, అడ్డగర్ల అజయ కుమారి, కామన మునిస్వామి, ఆకుల శేషుబాబు, పిఎల్.నర్సింహారావు, పిడి.మూర్తి, టి.సుమ పాల్గొన్నారు.

పీడిత పేద ప్రజలు, కార్మికుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన నాయకుడు ఏచూరి అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు.

తణుకు రూరల్ : మార్క్సిస్టు మేధావి, ఎర్రజెండా ముద్దుబిడ్డ, సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు అన్నారు. సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాలిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ శాఖా కార్యదర్శులు తిరునాదం వెంకటేశ్వరరావు, వాసా వెంకటేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, యండమూరి నాగేంద్ర పాల్గొన్నారు.



ఉండిలో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం : ఏచూరి ఆశయాలను సాధించేందుకు ఉద్యమాల్ని ముందుకు తీసుకువెళ్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు అన్నారు. శుక్రవారం ఉదయం ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డితో కలిసి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీను, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకివీడు : అస్తమించిన కమ్యూనిస్టు యోధుడు, కార్మిక ధార్మికుడు సీతారాం ఏచూరి లేకపోవటాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని పలువురు అభిమానులు, కార్యకర్తలు వాపోయారు. స్థానిక సిపిఎం సీనియర్ నాయకులు బొక్కా సత్యనారాయణ, ఆయన కుమారుడు బివి వర్మ 2018లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభల్లో సీతారాంతో కలిసి ఉన్న సమయాన్ని, సందర్భాన్ని గుర్తు చేసుకుని కొద్దిసేపు మనోవేదనకు గురయ్యారు. ఎన్నో అనుభూతులను వారు పంచుకున్నారు.

గణపవరం : సీతారాం ఏచూరి మరణం పీడిత ప్రజల ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కేశవరం గ్రంథాలయం వద్ద జరిగిన ఏచూరి సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కార్యదర్శి పి.నరశింహమూర్తి, పి.గోవింద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలతో ఉద్యమాల పోరాటయోధుడిగా ఉన్నారని అన్నారు. పిచ్చెట్టి ఓంకారమ్మ, పిచ్చెట్టి లక్ష్మి, పివిఆర్.సుబ్రహ్మణ్యం, గుత్తుల శ్రీను పాల్గొన్నారు.

పెనుగొండ : సిపిఎం వడలి గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తొంటా సత్యనారాయణ, కోమటి సత్యనారాయణ, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఉండి: సీతారాం ఏచూరి అమరజీవి అని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అన్నారు. శుక్రవారం ఉండి మండలం పాందువ్వ గ్రామ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పార్టీ సభ్యులు మల్లిపూడి వెంకటేశ్వరరావు, చొప్పర్ల చిట్టిబాబు, సోడదాసి గంగయ్య పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

స్టేట్ బ్యాంకు వద్ద కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఆచంట



స్టేట్ బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

ఆరుగాలం కష్టించి, ప్రకృతి వైపరీత్యాలకు పలుమార్లు పంట కోల్పోయి నష్టాలపాలవుతున్న కౌలురైతులకు బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వకుండా నిరాశ పరుస్తున్నారని, వారికి రుణాలు ఇవ్వాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. భూయజమానుల రుణాలతో సంబంధం లేకుండా కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ఆచంట స్టేట్ బ్యాంకు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఆచంట వంకతాళ్లచెరువు గ్రామానికి చెందిన కౌలురైతులు రైతు మిత్ర గ్రూపుల ద్వారా 15 సంవత్సరాలపైబడి బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారన్నారు. ఈ సంవత్సరం బ్యాంకుకు రుణాలు కట్టిన తర్వాత అధికారులు కౌలు భూమిపై భూయజమానులు రుణాలు తీసుకున్నారని, మీకు రుణం ఇవ్వబోమని చెప్పారని' తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా ఆచరణలో కౌలురైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో అక్కడకు చేరుకున్న మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు కేతా పూర్ణారావు, కౌలు రైతులు బండి శ్రీనివాస్, కేతా మోహన్‌రావు, కుడిపూడి విష్ణుమూర్తి, బండి మహేష్, కడలి సత్యనారాయణ, చింతపల్లి ధర్మారావు, కుడిపూడి శ్రీను, కట్టా దుర్గారావు, కేతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాల్లో తప్పు జరిగితే చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి



నీట మునిగిన వరిపంటను కలెక్టర్‌కు చూపిస్తున్న రైతులు

కాళ్ల: వరి పంట నష్టం అంచనాల్లో ఏదైనా తప్పు జరిగినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. కాళ్ల గ్రామంలో అధిక వర్షాల కారణంగా నీట మునిగిన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం పరిశీలించారు. ఎన్యుమరేషన్ జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పంట నమోదులో అర్హత కలిగిన ఏ ఒక్క కౌలు రైతు మిస్ అవకుండా నమోదు చేయాలని, అలాగే అర్హత లేని ఏ ఒక్కరిని నమోదు చేయకూడదని ఆదేశించారు. కాళ్లలో 90 ఎకరాల వరిపంట నీట మునిగిందని వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నష్టపోయిన పంట నమోదు జాబితాను రైతు సేవాకేంద్రంలో సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందని, రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. అలాగే పంట దెబ్బతిన్న వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు ఎంతవరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. వెంటనే నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంలో రైతులు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ వారం పది రోజులు నీరు పంట పొలాల్లో నిలబడటం వల్ల దుబ్బులు పూర్తిగా కుళ్లిపోయి నేలకొరగడం జరుగుతుందని, పూర్తిగా నష్టపోయామని, మళ్లీ ఖరీఫ్ సాగుకు సమయం సరిపోదని వివరించారు. పంట పొలాల పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఆకివీడు ఎడిఎ కెఎస్ఎస్.శ్రీనివాస్, ఎఒ జయ వాసుకీ, ఆర్ఐ, విఆర్ఒ, విఎఎ పాల్గొన్నారు.

కొవ్వలిని కలిసిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడుని ఆయన నివాసంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమీషనర్ రామ్మోహన్ నాయుడుకి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకున్నారు

కాశిపాడులో ఫ్రైడే డ్రైడేపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడులో శుక్రవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సహాయకులు నామాలరాజు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించటం వల్ల దోమలను నివారించవచ్చునని అన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. గ్రామంలో ఎవరికైనా తలపోటు, చలిజ్వరం వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజటర్ టివి సుబ్బలక్ష్మి, ఎఎన్ఎం.శివకుమారి, ఎంఎల్ హెచ్ పి.రమ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కాశిపాడులో అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై పిప్పర సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ సిహెచ్.దుర్గాభావాని అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవటం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరిగోల్డు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగొండ : పౌష్టికాహారం మహోత్సవంలో భాగంగా గుడ్లు, పాలు ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించవచ్చుని, ఎముకలు పటిష్టంగా ఉండాలంటే కాలుష్యంతో కలిగిన ఆహారం అందించాలని ఐసిడిఎస్ అధికారి అన్నారు. శుక్రవారం ఎర్ర నారాయణ స్వామి కాలనీల సచివాలయం-2లో కిశోర బాలికలకు, గర్భిణులు, బాలింతలకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీలో చేర్పించడం ద్వారా వారికి బొమ్మలతో విద్యను నేర్పించే అవకాశం ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండిలో నిర్వహించిన పౌష్టికాహార కార్యక్రమంలో భాగంగా వి.నిర్మల మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చిన పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఎఎన్ఎం డి రామలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు ఆశ కార్యకర్తలు గర్భిణీలు బాలింతలు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అర్థకట్ల సచివాలయం హైస్కూల్‌లో కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం లోపంతో వచ్చే రక్తహీనత నష్టాలు, జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా విద్యార్థులు విద్యార్థి దశలో మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని, చదువు పైన శ్రద్ధ వహించాలన్నారు. హెడ్ మాస్టర్ మూర్తిరాజు, పంచాయతీ సెక్రెటరీ మాధవి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు దాతల విరాళం

పెనుగొండ: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మాటలను అక్షర సత్యం చేస్తూ భాష్యం విద్యార్థులు తమ చిట్టి చేతులతో రూ.4,80,471 సేకరించారని ప్రిన్సిపల్ వి.అప్పారావు తెలియజేశారు. వరద బాధితుల సహాయార్థం యాజమాన్యం తలపెట్టిన విరాళాలు సేకరించు బృహత్ కార్యక్రమంలో అత్యధిక విరాళం సేకరించిన ఎల్‌కెజి విద్యార్థి మండేలా లోహిత్ రూ.10,616, నాలుగో తరగతికి చెందిన మోకరాల నాగదేవి శ్రిహిత రూ.7,771, కొడాలి ప్రార్థన ఐదో తరగతి రూ.7000 సేకరించారు. సేకరించిన మొత్తాన్ని యాజమాన్యం ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : తణుకు నియోజకవర్గం నుంచి రూ.కోటి 63 లక్షల 77 వేల 261లు ముఖ్యమంత్రి సహాయ నిధికి నియోజకవర్గ ప్రజలు చెక్కుల రూపంలో అందించి దాతృత్వం చాటుకున్నారని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. శుక్రవారం తణుకు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంట: సంపాదించడం ఎంత ముఖ్యమో సమాజ సేవకు దాతృత్వం కలిగి ఉండడం అంతే ముఖ్యమని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్య నారాయణ అన్నారు. ఆచంట ఛాంబర్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వరద బాధితులకు రూ.లక్ష వెయ్యి 116లు చెక్కును ఎంఎల్ఎ పితాని చేతుల మీదుగా ఆచంట ఇన్ ఛార్జి తహశీల్దార్ డి.సునీల సంధ్యకు అందజేశారు. కేశా రామకృష్ణ, గణేశుల సుబ్బా రావు, చల్లా శ్రీనివాస్, నంబూరి రాజా, నంబూరి అంజిబాబు, శ్రీను పాల్గొన్నారు.

వరద సాయం అందజేత

తణుకు : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కలిసి దాతలు ఇచ్చిన రూ.కోటి 63 లక్షల 77 వేల 261లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరించినందుకు మంత్రి లోకేష్ వారిని అభినందించారు.

జిల్లా కలెక్టర్లను కలిసి చెక్కులు అందించిన దాతలు

భీమవరం : అనూహ్య వరదలతో నిర్వాసితులైన బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. భీమవరం కలెక్టరేట్లో శుక్రవారం పలువురు దాతలు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి వ్యక్తిగతంగా, సంస్థల ద్వారా తమ విరాళాలు అందజేశారు. దాతలను జిల్లా కలెక్టర్ అభినందించారు. తణుకు ఆక్వామెరిన్ బెక్ట్రెల్ట్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, రూ.2 లక్షలు, నరసాపురం ఆగ్రికల్చర్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కెఎస్‌వి.రాజా, డైరెక్టర్లు సజ్జ ప్రసాద్, కోరిపల్లి శ్రీను, పి.సుభాష్ రూ.లక్ష, తణుకు లహమ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ అరవింద్ సేఠీ రూ.లక్ష, గుజరాత్ స్టేట్ పెట్రోల్ కెమికల్ లిమిటెడ్ రూ.20 వేలు జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

పెనుమంట్ర : రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది విఆర్ఒలకు సంబంధించి ఒకరోజు బేసిక్ పే వేతనంగా రూ.కోటి 30 లక్షలు కలెక్ట్ చేసేలా సిఎంకు తమ సంఘం అంగీకార పత్రం అందజేసినట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. వరద సహాయక కార్యక్రమాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు చేసిన సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, కృష్ణాజిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శీలం నరసింహారావు ఉన్నారు.

మొగల్తూరు : వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయ నిధికి రూ.5 వేల డిడిని శ్రీమ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ సత్తినేని శ్రీనివాస్ తాతాజీ తహశీల్దార్ సిహెచ్.విద్యాపతికి శుక్రవారం అందించారు. పంచాయతీ కార్యదర్శి విఆర్ఒ రాజు, కోపనాతి శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

గణపవరం : గణపవరం డిగ్రీ కళాశాలకి చెందిన కృపానందం, ప్రేమ జ్యోతి, దుర్గాభవానికి వారి విద్యాభివృద్ధికి కాంక్షిస్తూ స్థానిక వ్యాపారస్తులు బైరబోయిన మల్లాష్టి కుమారుడు బైరబోయిన చైతన్య వర్మ మిడిల్ వాయిదా కాలేజీ పరీక్ష ఫీజు రూ.16,500 చెల్లించినట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి శుక్రవారం తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న సహకారం మరువ లేనిది అన్నారు. తమ కాలేజీ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించిన చైతన్య, వి.వి.వికలీక కాలేజీ తరుపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.మధుబాబు పాల్గొన్నారు.

ఫుడ్ ఫ్యాక్ట్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

తాడేపల్లిగూడెం: స్వాభిమాన్ ఫౌండేషన్ ద్వారా ప్రత్తిపాడులోని ఫుడ్ ఫ్యాక్స్ అండ్ ఫెర్టిలైజర్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తాడేపల్లి గూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జువ్వలపాలెంలో ఆర్ఒ ప్లాంట్ ప్రారంభోత్సవంతో పాటు, ప్రత్తిపాడు లోని ప్లాంట్స్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి నిధుల మంజూరు

నరసాపురం: నరసాపురం పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.1.75 కోట్లు మంజూరు చేసిందని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారివురు మాట్లాడారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకి సేకరించిన నాలుగు ఎకరాల రైతులకు పరిహారం, ఏర్పాటుకు రూ.3.75 కోట్లు అంచనా అన్నారు. పురపాలక సంఘం వాటా రూ.1.75 కోట్లు గతంలోనే అందించిందన్నారు. ప్రభుత్వ వాటా విడుదల చేయలేదన్నారు. నూతనంగా ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేయడంతో సమస్య పరిస్కారం కానుందన్నారు. ఎంఎల్ఎ నాయకర్ కృషితోనే మంజూరయ్యాయని ఆర్‌డిఒ అన్నారు. నసేన నాయకులు పాల్గొన్నారు.

రూ.6.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి

శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం: మండలంలో ఆరున్నర కోట్లతో గ్రామాల్లోని రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కె.పెంటపాడు, ఉమామహేశ్వరం, యానాలపల్లి గ్రామాల్లో వివిధ రోడ్లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సాయి శక్తులా కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, గ్రామ పంచాయతీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలతో సంబంధం లేకుండా ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు. నిధులు నేను తీసుకు వస్తాను నాకు సహకారం ఇవ్వండి అంటూ కూటమి నాయకులతో పాటు ప్రతిపక్ష నాయకులను ఆయన కోరారు. ఎవరు అడ్డు వచ్చినా అభివృద్ధిని మాత్రం ఆపలేరని, పంచాయతీల అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ తున్నాం అన్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే 2014 నుంచి 2019 వరకు గృహ నిర్మాణాలకు ఇచ్చిన హామీ ప్రకారం నిధులను ఖాతాదారులకు అందించేందుకు కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగీకరించారని, అప్పట్లో ఎకౌంట్లో ఒక రూపాయి జమ అయిన వారందరికీ అతి త్వరలోనే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మూడున్నర కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, పెంటపాడు మండల జనసేన పట్టణ, మండల అధ్యక్షులు పుల్లా బాబి, వర్తనపల్లి కాశి, టిడిపి నాయకులు కిలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకర్

జిల్లా ఎస్‌పి అద్నామ్ నయీమ్ అస్మిని భీమవరంలోని ఆయన కార్యాలయంలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని లా అండ్ ఆర్డర్, పలు అంశాలపై చర్చించారు.

చవ్వాకుల భరత్‌కు జ్యోతిరావు పూలే అవార్డు

నేడు బెంగళూరులో ప్రదానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బెంగళూరు పట్టణం జక్కురులో జరగనున్న సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక దళిత బహుజన నాయకుడు, అంబేద్కర్ ఆలోచన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ కుమార్‌కు జ్యోతిరావు పూలే అవార్డు లభించింది. భరత్ చేస్తున్న దళిత బహుజన సామాజిక ఉద్యమంలో అనేక సమస్యలు పరిష్కరించడంలో జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు, ఉద్యోగులు, ఉద్యమనేతలతో కలిసి చేసిన సేవలను గుర్తిస్తూ, క్రాంతి జ్యోతి, రాష్ట్రపిత, మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డుతో సత్కరించడం జరుగుతుందని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవార్డు ఈనెల 14న భరత్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా పలువురు దళిత నేతలు, జర్నలిస్టులు అభినందించారు.

ఇంటి నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో ఇల్లు నిర్మించుకుంటున్న పేద కుటుంబానికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు సిమెంట్ బస్తాల సాయం చేయడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు పెన్మేత్స నాగరాజు పేర్కొన్నారు. కాళ్లకూరు గ్రామంలో ఈదా భోగేష్ కుటుంబానికి 50 సిమెంట్ బస్తాల సాయం శుక్రవారం అందజేశారు.

నిట్‌లో ఘనంగా స్వచ్ఛతా పక్వాడ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్, ప్రయత్నం క్లబ్, టాస్క్‌ఫోర్స్ క్లబ్, బృందావనం క్లబ్‌లు సంయుక్తంగా స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్టర్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంగణంలోని అకడమిక్ భవనాలు, క్యాంటీన్, ఇండోర్ స్టేడియం, నిట్ ముఖద్వారం పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. ముందుగా పరిపాలనా భవనం నుంచి నిట్ తూర్పు ముఖద్వారం వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై అవగాహనను కలిగి ఉండాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ శ్రీనివాస్, సంధ్యారాణి, క్లబ్ కార్యదర్శులు బి.తరుణ్, జగదీష్, మల్లికార్జున్, ఎం.సాయి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

నీట మునిగిన వరిచేలకు నష్ట పరిహారం

వరిచేల జాబితాను పరిశీలించిన జెడిఎ వెంకటేశ్వరరావు

కాళ్ల : ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగి నష్టపోయిన వరిచేలకు నష్టపరిహారం అందించేందుకు నివేదికలు తయారు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ జెడిఎ జెడ్. వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. ఏలూరుపాడు గ్రామంలో నీట మునిగిన వరిచేలను శుక్రవారం అయన పరిశీలించారు. పంట నష్ట జాబితాను కూడా పరిశీలించి నష్టపోయిన కౌలు రైతులందరూ జాబితాలో తప్పనిసరిగా నమోదు కావాలని సూచించారు. అదేవిధంగా ఉప్పుటేరు ద్వారా వెనుకకు వస్తున్న నీటిని కూడా పరిశీలించారు. పంట నష్టపరిహార జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా పంట నష్టాన్ని నమోదు చేయాలని, కౌలు రైతులను ఖచ్చితంగా జాబితాలో పొందుపరచాలని వ్యవసాయ సహాయకులకు, విఆర్ఒలకు సూచించారు. అయన వెంట ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ ఎస్.శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారిని సి.జయవాసుకి, విఆర్ఒలు సుబ్రహ్మణ్యం, మణికుమార్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో ఇసి ఈ నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్

నరసాపురం: స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగమునందు ఈనెల 12, 13వ తేదీలలో నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో ఇసిఇ విభాగం వరుసగా నాలుగు సార్లు ఎన్‌బిఎ గుర్తింపు పొందినందుకు ఇసిఇ విభాగ సభ్యులను అందర్నీ అభినందించారు. ఇలాంటి ఫెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచుటకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని విద్యార్థులు అందరినీ ప్రోత్సహించారు. ఇలాంటి కార్యక్రమములు జరుపుటకు విద్యార్థులకు మేనేజ్మెంట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కె.త్రినాధస్వామి పనిచేశారు.

వృద్ధులకు సహకారం చేయడం అభినందనీయం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం


ఆహారాన్ని అందజేస్తున్న కుటుంబ సభ్యులు

నిరాశ్రయులైన వృద్ధులకు సహకారం చేయడం అభినందనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం పట్టణ నాయకులు బొక్కా సత్యనారాయణ, శాంతకుమారి మనవరాలు సుమేఘా ధ్రీతి జన్మదిన వేడుకలు కుటుంబ సమేతంగా శుక్రవారం స్థానిక జడ్డు బ్రహ్మాజీరావు, సూర్యకాంతం వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలన్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలు ఆడంబరాలకు, భారీ ఖర్చులకు, దుబారా ఖర్చులకు ప్రతీకగా మారిన ఈరోజుల్లో ఇలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అండగా, సహకారంగా నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. బంధుమిత్రులు, స్నేహితులకు మాత్రమే పరిమితం చేయకుండా నిరాశ్రయులైన వృద్ధులకు సహకారంగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. బొక్కా సత్యనారాయణ కుటుంబం ఆర్థికంగా ఉన్నత కుటుంబం కాదని ఉన్న ఆర్థిక పరిస్థితుల్లోనే మరొకరికి సేవ చేయాలనుకోవడం స్ఫూర్తిదాయకం అన్నారు. కుమారుడు బొక్కా కిరణ్, కోడలు సాహిత్య సేవాతత్పరమైన ఆలోచనలతో కుమార్తెకు తొలి నుంచీ బీజం వేయాలనుకోవడం అదర్శనీయమన్నారు. వృద్ధులకు పలురకాల సేవా కార్యక్రమాలు చేస్తున్న బొక్కా సత్యనారాయణ కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బొక్కా సత్యనారాయణ కుటుంబ సభ్యులు, నిర్వాహకులు రాజు, వృద్ధులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

17న జాతీయ నులి పురుగుల దినోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సరాబు సునిల్ అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయిలో నులిపురుగుల నివారణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరాబు సునిల్ మాట్లాడుతూ నులిపురుగుల కార్యక్రమం ప్రతీ ఆరు నెలలకు ఒకసారి 1-19 సంవత్సరాల పిల్లలకు నులి పురుగుల నుంచి సంక్రమించు వర్మ్ ఇన్ఫెక్షన్, తద్వారా వచ్చు రక్తహీనత వంటి సమస్యలు రాకుండా చేయవచ్చున్నారు. ఈనెల 17న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో జరుగుతుందన్నారు. ఎవరైనా 17వ తేదిన మిస్ అయినచో మొప్ అప్ ఈనెల 25న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ జి.స్వాతి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ స్టాఫ్‌కి సూచించారు. వీటితో పాటు జ్వరాలు, వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ వంటి అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, సూపర్వైజర్స్, ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పి ఎస్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గణపవరం : ఈనెల 17న నులుపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని గణపవరం సిఎహెచ్ఒ జాలాదివిల్సన్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన మండల టాస్కుఫోర్సు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు స్కూల్ టీచర్ల పర్యవేక్షణలో మాత్రలు ఇస్తామని చెప్పారు. మరలా 25వ తేదీనాడు మిగిలిన విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎహెచ్ ఇఒ జి.వెంటేశ్వర్లు, ఎన్.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి

భీమవరం టౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ వంటి ఆదర్శనీయమైన ఇంజనీర్లు కనీస వసతులు లేని రోజుల్లో ప్రాజెక్టులు నిర్మించి భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దారని ప్రముఖ సివిల్ ఇంజనీర్, పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాలకృష్ణ మూర్తి పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) భీమవరం లోకల్ చాప్టర్, ఐఇఇ విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఎసి ఎస్‌వి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి హాజరైన ఇంజనీరింగ్ నిపుణులు ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఇఇ భీమవరం లోకల్ చాప్టర్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కె.సురేష్ బాబు, హానరరీ కార్యదర్శి డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం ఇంజనీర్స్ డే ని పురస్కరించుకొని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాలకృష్ణ మూర్తిని ఘనంగా సత్కరించారు.

హిమశ్రీకి రూ.లక్ష నగదు బహుమతి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మహాన్యూస్ వారు ఈనెలలో నిర్వహించిన మేము సైతం, జయహో భారత్ పోటీలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థిని హిమశ్రీ వర్ష ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి లక్ష రూపాయల బహుమతి గెలుపొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతులు మీదుగా లక్ష రూపాయల బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 12 వేల మందికిపైగా పోటీపడగా అందులో ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ విద్యార్థిని హిమశ్రీ వర్ష రాష్ట్రస్థాయిలో బహుమతి సాదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో సంఘటనలను గుర్తు చేసుకున్నారు. మీరు ఎంచుకున్న ఏ రంగంలో అయిన సరే ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మహాన్యూస్ స్టాఫ్ రిపోర్ట్ బోడపాటి రంగబాబు, పోకల రాము, పాలకొల్లు మండల రెవెన్యూ అధికారి యడ్ల దుర్గా కిషోర్, మండల విద్యాశాఖాధికార్లు వీరా స్వామి, శర్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆచంట

అకాల వర్షాలు, వరదల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దిగుమర్తి సూర్య కుమార్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వ్యాధుల పట్ల ప్రమాదంగా ఉండి, ప్రజలకు అందుబాటులో సేవ చేయాలని సూచించారు. వైస్ ఎంపిపిలు ఎర్ర గొప్పల నాగరాజు, తాళం శ్రీనివాసరావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక సంఘ కమిషనర్ శ్రీరామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు 15 రోజుల స్వచ్ఛత హే సేవ కార్యక్రమం నిర్వహించుచున్నారు. దీనిలో భాగంగా పురపాలక సంఘం పరిధిలో ఈ 15 రోజులు రోజువారీగా నిర్వహించవలసిన కార్యక్రమాలపై పురపాలక సంఘ సిబ్బందికి, వార్డు సచివాలయ సిబ్బందికి శుక్రవారం కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని రంగసాయి, లయన్స్ కృష్ణంరాజు ఉన్నారు.

విద్యార్థుల అవసరాల తగ్గట్టు కరిక్యులం రూపకల్పన

పాలకొల్లు : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాలలోని అన్ని శాఖలకు సంబంధించి యూజీ, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి కళాశాల అనుబంధ యూనివర్సిటీ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంపిక చేసిన అధ్యాపకులు యూనివర్సిటీ నామినీలుగా, ఇతర యూనివర్సిటీలకు సంబంధించిన అధ్యాపకులు సబ్జెక్ట్ ఎక్స్‌పర్టులుగా విచ్చేసి వివిధ సబ్జెక్టులకు సంబంధించి లోకల్ నీడ్స్, ఇండస్ట్రియల్ నీడ్స్‌కు తగ్గట్టుగా సలహాలు, సూచనలు చేశారు. సిలబస్‌లో సవరణలు చేసి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండే కరికులం ఫ్రేమ్ చేయడానికి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు సంబంధించి వివిధ విభాగాల అధ్యాపకులు, ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతినిధులు, కళాశాల ఆలుమిని మెంబర్స్, విద్యార్థి మెంబర్లు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

ఉండి: ఏ ఆధారం లేని నిరుపేద కుటుంబానికి నెలసరి నిత్యావసర సరుకులు ఇచ్చి ఆపన్న హస్తం అందించడమే నిజమైన సేవని ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన పూరిళ్ల సత్యనారాయణ దంపతులకు నెలకి సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు, నగదును శుక్రవారం అందించారు. పూటగడవని కుటుంబాలకు ఎంతో కొంత సాయం అందించడంలో మానవతా సంస్థ ఎప్పుడు ముందుటుందని ఆయన తెలిపారు. మండల కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరావు మాట్లాడుతూ కడలి శాంతాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా కడలి త్రివిక్రమ్ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యుడు మాన్యం వాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయలతో ప్రత్యేక అలంకరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం 2వ వార్డు చలవపేటలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం 7వ రోజు శాకంబరీ వినాయకుడిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు భూపతి బాల బాలాజీ, ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి సరస్వతిరావు పాల్గొన్నారు.